క్లుప్తంగా

ఆర్థికసాయం

కడప కల్చరల్ : పేదరికం వల్ల చదువుకు ఇబ్బందులు తలెత్తుతున్న ఓ విద్యార్థిని గురించి తెలుసుకున్న బాసట సంస్థ ప్రతినిధులు తమవంతు సాయం అందించి ఆదుకున్నారు. కడప నగరానికి చెందిన శ్రీ విజయ దుర్గ నర్సింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న సౌభాగ్య పరీక్ష ఫీజు కట్టేందుకుగాను రూ.5 వేల చెక్కును బాసట సభ్యులు డీపీ కార్తిక్ రెడ్డి, మిత్రులు సమకూర్చడంతో బాసట అధ్యక్షుడు మేరువ బాలాజీ రావు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు సౌభాగ్య, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థులతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ఉర్దూ బాయిస్‌హైస్కూల్‌లో ఆదివారం తైక్వాండో విద్యార్థులకు కడప నియోజక వర్గ నేత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ బహుమతులను ప్రదానం చేశారు. కొద్ది రోజులుగా ఇక్కడ తైక్వాండోలో శిక్షణ తీసుకుంటున్న వారికి ఆదివారం శిక్షణ ముగిసింది. దీంతో సంబంధిత విద్యార్థులకు బహుమలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆట-పాట



చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక విజిల్స్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. చిన్నారుల నృత్యాలకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నగరంలో మోస్తరు వర్షం



కడప కార్పొరేషన్ : కడప నగరంలో శని, ఆదివారాల్లో రాత్రివేళల్లో మోస్తరు వర్షం కురిసింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వ్యాపారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం సాయంత్రం నగర శివార్లలోని రామరాజుపల్లె, చౌటపల్లె, పబ్బాపురం, ఆలంఖాన్‌పల్లె ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పెద్దమ్మ తల్లికి పూజలు



కూరగాయల అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న పెద్దమ్మ తల్లి

చాపాడు : మండల పరిధిలోని రాజువారిపేట గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లికి గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం మొదలైన సందర్భంగా మొదటి ఆదివారం గ్రామంలోని పెద్దమ్మ తల్లిని అర్చకులు కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఏడాది పొడవునా గ్రామం పాడి పంటలతో తులతూగాలని గ్రామస్తులు వేడుకుంటూ పూజలు నిర్వహించారు.

గాజుల అలంకారంలో ..

ప్రొద్దుటూరు : గోపవరం పంచాయతీలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో ఆషాఢ మాసం రెండో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా గాజులతో అలంకరించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా గ్రామోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని దొరసానిపల్లె ఉన్న సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలో భాగంగా ఆదివారం సాయినాథుని గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సాయినాథునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేకంగా రూపొందించిన రథంపై బాబా ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి పురవీధుల్లో సాయినామ కీర్తనలు, డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగించారు.

నిష్పక్షపాతంగా టమాటాల పంపిణీ





టమాట పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు, టమాటాల కోసం క్యూలో వేచి ఉన్న వినియోగదారులు

కడప అగ్రికల్చర్ : ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న టమాటలను నిష్పక్షపాతంగా పంపిణీ చేస్తామని మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు అన్నారు. ఆదివారం కడప రైతుబజార్‌లో ప్రభుత్వం కిలో రూ. 50 సబ్సిడీతో అందించిన టమాటాల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో టామాటాల రేటు భారీగా పెరగడంతో వినియోగదారులకు భారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం అధిక రేటులో కొనుగోలు చేసి తక్కువ ధరకు అందిస్తోందన్నారు. కడప రైతు బజార్‌కు ఆదివారం రెండు టన్నుల టమాట వచ్చిందన్నారు.

విక్రయాలు సక్రమంగా ఉండాలని భావించి ఆధార్‌కార్డుతో ప్రతి వినియోగదారునికి కిలో చొప్పున అందిస్తున్నామన్నారు. వినియోగదారులు కూడా ఒక్కొక్కరు ఒక కిలో మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు. మున్ముందు అధికంగా టమాటాలు తెప్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ ఏడీ ఆజాద్, రైతు బజార్ మేనేజర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపునకు స్పందన



కలెక్టర్, జేసీలకు స్వాగతం పలుకుతున్న ఆఫీసర్స్‌క్లబ్ ప్రతినిధులు

వైవీయూ : కడప నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపునకు క్లబ్ సభ్యులు, ప్రజల నుంచి చక్కటి స్పందన లభించింది. దీనిని జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఫీసర్స్ క్లబ్ సేవలను మరింత విస్తరిస్తామన్నారు. క్లబ్‌లో రెస్టారెంట్, మహిళలకు ప్రత్యేకంగా జిమ్, యోగ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్లబ్‌లో పిల్లలకు ప్రత్యేకంగా శిక్షకులను నియమించి జిమ్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. క్లబ్ అభివృద్ధి పనులన్నింటినీ త్వరితగతిన పూర్తిచేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు జిల్లా అధికారులకు సైతం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, కడప నగర కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్‌చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్, ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి డా. పి. యదుభూషణ్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ డా. వి. బ్రహ్మయ్య తదితరులు మాట్లాడారు. ఈ మెగా మెడికల్ క్యాంపులో 500 మంది రక్తపరీక్షలు, 800 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు సైతం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. క్యాంపులో 18 మంది ప్రముఖ వైద్యులు సేవలందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కోశాధికారి వీరభద్రయ్య, డీఎం అండ్ హెచ్‌ఓ నాగరాజు, ఈసీ మెంబర్లు ఎల్. మధుసూధన్‌రెడ్డి, జె. విజయభాస్కర్, రవి, సుబ్బరామయ్య, సుధాకర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ అవార్డులు, పాఠాల తొలగింపు అసంబద్ధం



మాట్లాడుతున్న రాజశేఖర్ రాహుల్

కడప కల్చరల్ : 72 సైన్స్ అవార్డుల రద్దు...సైన్స్, చరిత్ర పాఠాల తొలగింపు అసంబద్ధమని జన విజ్ఞాన వేదిక(జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఈ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఈ నిర్ణయాలు తీసుకుందని, వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బాల బయన్న మాట్లాడుతూ తమ రంగాల్లో కృషి చేసిన వారిని ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని, కానీ దాన్ని కూడా లాగేసుకుని శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని కీలుబొమ్మలా మార్చేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నం దారుణమన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతూ దేశం ప్రగతి పథాన నడుస్తోందని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. పాఠ్యాంశాలలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం సరికాదన్నారు. ఒకవైపు అశాస్త్రీయమైన వాస్తు, జ్యోతిష్యం పాఠాలు పెట్టి ఇలాంటి శాస్త్రీయ అంశాలను తొలగించడం తిరోగమన చర్య అని విమర్శించారు. మేధావులు, శాస్త్రవేత్తలు, శాస్త్ర ప్రచార సంస్థలు వీటిని ఖండించాలని విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సరస్వతి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖైదీలను కలుసుకోవాలంటే..



కడప కేంద్రకారాగారం

కడప కార్పొరేషన్ : నేరాలకు మూలం ఏదైనా నేరస్తులు ఎలాంటి వారైనా వారికి బంధాలుంటాయి. బంధుమిత్రులు ఉంటారు. జైలులోని రిమాండ్ ఖైదీలు, శిక్ష అనుభవిస్తున్న వారిని కలుసుకోవడానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఎవరి అనుమతి తీసుకోవాలి, వారిని ఎన్నిసార్లు కలవచ్చు, ఎంత సమయం మాట్లాడవచ్చనే దానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఖైదీని కలుసుకొని మాట్లాడటాన్ని జైలు పరిభాషలో ఇంటర్వ్యూ లేదా ములాఖత్ అని పిలుస్తారు.

దరఖాస్తు పూర్తి చేయాలి

జైలులో ఉన్నవారిని కలిసేందుకు ముందుగా ఒక దరఖాస్తును పూర్తి చేయాలి. సంబంధిత ఖైదీ వివరాలు, కలవడానికి వచ్చిన వారి వివరాలు, ఖైదీతో వారికున్న అనుబంధంతోపాటు తమ చిరునామాలు కూడా దానిలో పూరించాలి. కలవడానికి వచ్చిన వారి ఆధార్‌కార్డు లేక రేషన్ కార్డు జిరాక్స్ కాపీని జత చేయాలి. దరఖాస్తును జైలు సిబ్బందికి ఇస్తే వారు సూపరింటెండెంట్‌కు అందజేస్తారు. ఆయన దానిని పరిశీలించిన తర్వాత అనుమతి ఇస్తారు. వారానికి రెండుసార్లు సాధారణ పనిరోజుల్లో ఖైదీలకు తమ కోసం వచ్చిన వారిని కలిసే అవకాశం కల్పిస్తారు.

సమయమిదే..

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్యలో సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల మధ్యలో ఖైదీలను కలవచ్చు. సుమారు 20 నిముషాల పాటు వారితో మాట్లాడే అవకాశం ఉంటుంది. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో ఖైదీలను కలుసుకోవడానికి అనుమతి ఇవ్వరు. ఖైదీని కలిసే అవకాశాన్ని తల్లిదండ్రులు, భార్య లేక భర్త, పిల్లలు, బంధువులు, స్నేహితులు, న్యాయవాదులకు కల్పిస్తారు.

ఖైదీలకు ఏమేం ఇవ్వచ్చు..

ఖైదీలను కలవడానికి వచ్చేవారు పండ్లు, కవర్ ప్యాకింగ్ ఉన్న బిస్కట్లు, స్వీట్లు, పచ్చళ్లు, దుస్తులు, దుప్పట్లు ఇవ్వొచ్చు. డాక్టర్ పరిశీలించిన తర్వాత సూపరింటెండెంట్ అనుమతితో మందులు కూడా ఇవ్వవచ్చు. అయితే ముందుగా వాటిని జైలు సిబ్బంది పరిశీలించిన తర్వాతే ఖైదీలకు అందిస్తారు. డబ్బు ఇవ్వాలనుకుంటే దానిని జైలు సిబ్బందికి అందజేస్తే ప్రిజనర్ ప్రయివేట్ క్యాష్ (పీపీసీ)లో డిపాజిట్ చేస్తారు.

అందుబాటులో ఫోన్ సదుపాయం

జైలులోని ఖైదీలకు ఫోన్ చేసే సదుపాయం కూడా ఉంటుంది. 5 నిముషాల కాల్‌కు రూ.10 వసూలు చేస్తారు. ఫోన్ సంభాషణ జైళ్ల శాఖ ఉన్నత కార్యాలయంలో రికార్డు అవుతుంది. దాన్ని దృష్టిలో ఉంచుకొని ఖైదీలు మాట్లాడాల్సి ఉంటుంది. నెలకు రెండుసార్లు ఫోన్ చేసుకోవచ్చు. 15 రోజులకు ఒకసారి ఖైదీలకు ఉత్తరం రాసుకొనే అవకాశం ఇస్తారు.

సిబ్బంది సమక్షంలోనే మాట్లాడాలి

ఖైదీలను కలిసేందుకు వచ్చిన వ్యక్తులతో సిబ్బంది సమక్షంలోనే మాట్లాడిస్తారు. అంతేగాకుండా ఖైదీల కోసం వారు తీసుకొచ్చిన పండ్లు, బిస్కెట్లు, పచ్చళ్లు వంటివి ముందుగా జైలు సిబ్బంది పరిశీలించిన తర్వాతే ఖైదీలకు ఇస్తారు.

కామన్ సీనియారిటీతోనే ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఎంఈఓ-1 పోస్టుల పేరుతో భర్తీ చేస్తున్న పోస్టులను ఏకీకృత సీనియారిటి అయిన ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) చైర్మన్ మాదన విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఓ-1 పోస్టులను కామన్ సీనియారిటి ప్రకారం ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సి ఉండగా అందుకు భిన్నంగా కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులకు కట్టబెట్టేలా ఉత్తర్వులు జారీ చేయడం తగదన్నారు. జీవో 154 ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1154 ఆర్ట్స్, క్రాఫ్ట్స్, మ్యూజిక్ పోస్టులను రద్దు చేసి వాటి స్థానంలో ఎంఈఓ-1గా 13 పోస్టులను, ఎంఈఓ-2గా 679 పోస్టులను క్రియేట్ చేశారన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎంఈఓ పోస్టులను ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులతోనే భర్తీ చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం పునరాలోచించి ప్రభుత్వ, జిల్లా పరిషత్తు యాజమాన్య ఉపాధ్యాయులను కలిసి సీనియారిటీ లిస్టు తయారు చేసి పదోన్నతులను ఇవ్వాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ అధ్యక్షులు రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, గురుమోహన్, ఏపీటీఎఫ్ నాయకులు అబ్దుల్లా, ఖాదర్‌బాష, హెచ్‌ఎం సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం



వికలాంగులకు వస్త్రాలు, సరుకులు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ నాయకులు

కమలాపురం : స్థానిక ఆర్యవైశ్య సంఘం వారి వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం అని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య తెలిపారు. ఆదివారం వాసవీ క్లబ్ డాన్ టు డస్క్‌ను పురస్కరించుకుని పట్టణంలోని 30 మంది వికలాంగులకు క్లబ్ నిర్వాహకులు వస్త్రదానంతో పాటు సరుకులు పంపిణీ చేశారు. అలాగే దేశ భద్రతను కాపాడిన విశ్రాంత సైనికుడు ఈశ్వరయ్యను సన్మానించారు. పేద రైతుకు యూరియా అందజేశారు. ఖాజీపేట మార్గంలో సుస్వాగతం-కమలాపురం బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు బచ్చు సుబ్రమణ్యం, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి గాజులపల్లె శేఖర్, సంఘం నాయకులు మల్లికార్జున, రెడ్డి సురేష్, శంకర్ రావు, సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ హాకీ క్రీడాకారుడికి నివాళి



కృపవరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీనియర్ హాకీ క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన సీనియర్ హాకీ క్రీడాకారుడు కృపవరానికి కడప హాకీ క్రీడాకారులు నివాళులర్పించారు. ఆదివారం కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో కృపవరం జ్ఞాపకార్థం హాకీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హాకీ సీనియర్ క్రీడాకారులు సుభాన్‌బాషా, రమేష్, చూడామణివర్మ, సుధాకర్, రాంబాబు, విలియమ్స్ తదితరులు మాట్లాడుతూ జిల్లాకు చెందిన గొప్ప హాకీ క్రీడాకారుడి మరణం బాధాకరమన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు భాస్కర్, సందీప్, కీర్తి, ప్రవీణ్, బాషా, అనిల్, సునీల్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య కృషీవలుడు డీకే చదువుల బాబు



డీకే చదువులబాబును సత్కరిస్తున్న కవులు, రచయితలు

ప్రొద్దుటూరు కల్చరల్ : సాహిత్య కృషీవలుడు డీకే చదువుల బాబు అని చైతన్య సాహిత్య కళావేదిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కవి కాశీవరపు వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక చైతన్య సాహిత్య కళావేదిక కార్యాయలంలో ఆదివారం కేంద్ర సాహిత్య ఆకాడమి అవార్డుకు ఎంపికైన డీకే చదువుల బాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాశీవరపు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా చదువుల బాబు ఎన్నో రచనలు చేశారని కొనియాడారు. బాలల కోసం ప్రముఖ పత్రికల్లో వందల సంఖ్యలో రచనలు చేయడంతోపాటు 21 పుస్తకాలను ప్రచురించారన్నారు. ఆయనకు కేంద్ర సాహిత్య అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. కవులు కామనూరు రామమోహన్, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, పల్లా కృష్ణ, పల్లా రామారావు, కంభం పాములేటి, పెద్దయ్య, ప్రతాప్, నరసింహ పాల్గొన్నారు.

5 నుంచి శీతల గంగమ్మ జాతర

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పార్వతీపురంలో వెలసిన శీతల గంగమ్మ అమ్మవారి 20వ జాతర మహోత్సవ కార్యక్రమం జూలై 5వ తేదీ నుంచి జరుగునని దేవస్థానం కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ శీతల గంగమ్మ అమ్మవారి జాతర సందర్భంగా జూలై 5వ తేదీన అమ్మవారికి పాలాభిషేకం, అలంకరణ, పొంగళ్లు, శక్తి పూజ, తీర్థప్రసాదాల వితరణ చేస్తామన్నారు. రాత్రి అమ్మవారి కథ, అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా గుడికి చేరుతుందన్నారు. జూలై 6వ తేదీన అమ్మవారికి ప్రత్యేక పూజలు సాయంత్రం అమ్మవారి ఊరేగింపు అనంతరం అమ్మవారి ప్రతిమను నిమజ్జనం ఉంటుందన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

మైదుకూరు : సోహిత్ మృతికి కారణమైన బీరం విద్యాసంస్థల యజమాని బీరం శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్ డిమాండ్ చేశారు. మైదుకూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థి అనుమానాస్పదంగా మృతికి కారణమైన విద్యాసంస్థల యజమానిని అరెస్టు చేయాలన్నారు. విద్యాసంస్థల గుర్తింపును శాశ్వతంగా రద్దు చేయాలని, విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులకు ఇష్టమైన పాఠశాల, కాలేజీలో చేరే విధంగా జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు అజయ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : బీరం విద్యాసంస్థల అధినేతపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌ఓ రాయలసీమ కన్వీనర్ ఓబులేసు ఓ ప్రకటనలో కోరారు. చనిపోయిన విద్యార్థి సోహిత్ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పోరుమామిళ్ల : ఖాజీపేట మండలం కొత్తనెల్లూరు దగ్గర బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థలో చదువుతున్న 6వ తరగతి విద్యార్థి సోహెల్ మృతికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలన్నారు.

4న ఉచిత వైద్య శిబిరం

మైదుకూరు : పట్టణంలోని ఎస్‌ఎల్‌ఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 4న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి డాక్టర్ మూలే రామ అనిల్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బద్వేలు రోడ్డులోని ఎస్‌ఎల్‌ఆర్ ఆస్పత్రిలో 4వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ-ఎకో తదితర పరీక్షలను ఉచితంగా చేస్తామని వివరించారు.

నేడు గురు పౌర్ణమి వేడుకలు

కమలాపురం : పట్టణ పరిధిలోని కుప్పూరువారిపల్లెలో వెలసిన సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం కమలాపురం పట్టణంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తూ భిక్షాటన చేశారు. సోమవారం ఉదయం 6 గంటలకు కాగడ హారతి, 7 గంటలకు తీర్థ ప్రసాదాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు సాయిబాబా గుడి నుంచి కమలాపురం పట్టణం వరకు భారీ ఊరేగింపు నిర్వహిస్తామని, భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని పోచంరెడ్డిపల్లె, పాయసంపల్లె, గంగిరెడ్డిపల్లె, పాలగిరి క్రాస్ వద్ద వెలసిన సాయిబాబా ఆలయాలలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాహకులు తెలిపారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ధరలను నియంత్రించాలి



రైతుబజార్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కడప అగ్రికల్చర్ : కొండెక్కిన టమాట, మిరప కూరగాయల ధరలనే వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం కడప రైతుబజార్‌లో ప్రభుత్వ సబ్సిడీ టమాట పంపిణీ కేంద్రంలో కూరగాయల ధరలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ టమాట, మిరప ధరలు వంద రూపాయలకు పెరిగాయన్నారు. దీంతో వినియోగదారులు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆదివారం నుంచి రైతుబజార్‌లో సబ్సిడీతో అందిస్తున్న టమాటాలకు సంబంధించిన కౌంటర్లను పెంచాలన్నారు. నగర కార్యదర్శి వెంకటశివ మాట్లాడుతూ రైతుబజార్‌కు వెళ్లే దారిలో ముందుకొచ్చిన షాపులను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యం, బాదుల్లా, బషీరున్నీషా, నగర సహాయ కార్యదర్శి మద్దలేటి, నాయకులు బాబు, దస్తగిరి, బాగలక్ష్మి, లింగన్న, రామ్మోహన్‌రెడ్డి, మునయ్య, సుబ్బరాయుడు, చైతన్య, మైనుద్దీన్, సంజీవ్,నాగార్జున, జాన్ శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

5న పాఠశాలల బంద్‌కు పిలుపు



మాట్లాడుతున్న మంజునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ, పుస్తకాల అమ్మకాలకు వ్యతిరేకంగా ఈ నెల 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నగరశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మంజునాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రాండ్ పేరుతో కార్పొరేట్ విద్యా వ్యాపారం జోరుగా కొనసాగుతోందన్నారు. సీబీఎస్‌సీ సిలబస్, స్మార్ట్స్, టెక్నో, ఒలింపియాడ్, ఇంటర్‌నేషనల్ స్కూల్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. వీటితోపాటు పాఠశాలలోనే బుక్స్, యూనిఫాంకు సంబంధించిన దుకాణాలను ప్రారంభించి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. అక్రమాలకు పాల్పడుతూ.. అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయిప్రసాద్, సునీల్, శివ, వంశీరాజు పాల్గొన్నారు.

గండికోటలో పర్యాటకుల సందడి



జమ్మలమడుగు : గండికోట ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. గండికోట ద్విచక్రవాహనాలు, కార్లతో నిండిపోయింది. ప్రస్తుతం పెన్నానదిలో గండికోట జలాశయం నుంచి నీరు విడుదల చేస్తుండటంతో పెన్నాలోయ నీటితో కళకళలాడుతోంది. ఈ దృశ్యాని చూడటం కోసం సాహసాలు చేస్తూ కొండల అంచులకు వెళ్లి సెల్ఫీలను తీసుకుంటున్నారు.

బొప్పాయి సాగుపై రైతుల ఆసక్తి

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా రైతులు బొప్పాయి పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చసిన ఆర్‌బీకేల ద్వారా ఎప్పటికప్పుడు రైతులు కొత్త రకాల పంటలను సాగుచేయాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. బొప్పాయి సాగుకు తక్కువ ఖర్చులతోపాటు దిగుబడి అధికంగా ఉండటంతో రైతులు బొప్పాయి పంట సాగుపై మక్కువ చూపుతున్నారు. బెంగుళూరు నుంచి ఒక్కో బొప్పాయి మొక్క రూ.16ల చొప్పున కొనుగోలు చేసి పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.80వేల ఖర్చు అవుతోందని.. పంటకు తెగుళ్లు, వైరస్ లేకుండా చూసుకుంటే ఎకరాకు 40 టన్నుల నుంచి 50 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం బొప్పాయి కాయలు టన్ను రూ.7వేల ధర పలుకుతోందని.. దిగుబడులు బాగావస్తే మంచి ఆదాయం పొందవచ్చునని రైతులు తెలుపుతున్నారు.